వనితాలోకం :

# ఇంటి నీడలో

'విజయా!' అని పిలిచాడు మాధవరావు. నిజానికి అతను ఎంత బాగా పిలుస్తాడు! తనకా పేరుండడం, ఆ పేరునే తన భర్త అంత చక్కగా పిలవటం ఎంత చిత్రం! మాధవరావు తనను పేరుపెట్టి పిలిచినప్పుడల్లా తన హృదయం చిగురులు తొడుగుతుంది. పేరులో ఉందా ఆ మాధుర్యం? లేక అతని కంఠస్వరంలోనే వుందా ఆ మృదుమధుర సంగీతం?!...కాకపోతే కంటిలోనూ అతిశయించిన మనోహరత్వమే తనను సమ్మోహింపజేస్తుందా? ఏమో...కాని అతనలా పిలిచినప్పుడల్లా విజయకేదో రసానందప్రపంచంలో వున్నట్టే ఉంటుంది.

'టైమైపోతోందమ్మా! కారు సిద్ధంగా వుంది. త్వరగా రావాలి. నిన్ను కాలేజీ దగ్గిరా, వాణ్ణి యూనివర్సిటీ దగ్గిరా దింపి నేను కోర్టుకెళ్లాలా మరి? చప్పున రావాలి.'

వీధిగదిలో కాలుగాలిన పిల్లిలా పచారు చేస్తూన్న మామగారి బొంగురు గొంతుక!

ఓ పక్కన నెలలపిల్ల ఇలెగిరిపోయేట్టు అరుస్తోంది! .. 'ఛీ.. పాడుపిల్ల ఇప్పుడే లంకించుకోవాలీ ఏడుపు?!...' అవతల రెండు పిలుపులొచ్చాయి విజయకి విసుగూ, చిరాకూ, దుఃఖం కూడా వస్తాయి ఈ ఘట్టాల్లోనే పిల్లని సముగాయిస్తోంది. ఓమూల అత్తగారీ హడావుడి కేం విసుక్కుంటుందో, అన్న భయం!..అయినా తనెందు కావిడంటే భయపడాలి? ఆవిడకి అయిష్టంగా తానేనాడూ ప్రవర్తించలేదు. ఇకముందు కూడా ప్రవర్తించదు. ఇంకా విపులీకరించి చెప్పాలంటే ఆ యింట్లో తానేపని చేసినా ఇతరులను తృప్తిపరచటానికే చేస్తోంది. అందుకు తన మనస్సే సాక్షి కాని ఈ చదువువిషయంలో ఉదయం కాలేజీకెళ్లే ముందున్న హడావుడితో అనుక్షణం అత్తగారే నిమిషంలో ఏమంటుందో అన్న భయంమాత్రం విజయకి తప్పదు. అత్తగారు రానేవచ్చింది 'వెళ్లు తల్లీ! ఆ పిల్లనిటు తేవే సముదాయిస్తాగాని..ఏవిటో సంసారం చేసేదానికి, అందులో పిల్ల తల్లికి ఏం చదువు నా ముఖం!...పెళ్లాం చదువులు వెలగబెట్టి ఊళ్లేలాలని ఒకటే హోరు! చూస్తున్నాంగా సౌభాగ్యం'...విజయ పిల్లనందించి పుస్తకాలు తీస్తూ వింటోంది అత్తగారి మాటలు. అవును. ఆ మాటలు తన కలవాటే. సాధారణంగా వింటూనే వుంటుంది కాబట్టి అట్టే మనస్సును బాధించవు పుస్తకాలు తీసుకుని బైటికి వస్తోంది అత్తగారు విసుక్కోటం అయింది కాబోలు చంటిదాన్ని ముద్దుగా బుజ్జగించటంలో పడింది వ్యవహారం. ఈమధ్యలోగా మరో పిలుపుకి మాధవరావు రానేవచ్చాడు ఎదురు. 'అన్నట్టు అమ్మాయ్! ఇవాళ మధ్యాహ్నం వచ్చెయ్యాలి సుమా! మరిచిపోయేవు! మళ్ళీ రేపు పూజా పునస్కారమూనా...కాస్త పిలుపూ అదీ ఇవాళే చూసుకుంటే మంచిదని'—

## “కల్యాణి”

అత్తగారి ఈ మాటలు విజయకి తరుచు వినిపిస్తూనేవున్నా విన్నప్పుడల్లా ఏదో భరించరాని కోపమో, మరే వికారమో ఆపాదమస్తకం వ్యాపిస్తుంది! అస్తమానం ఏవో నోములూ, వ్రతాలూ, పూజలూ, పునస్కారాలూ, పేరంటాలూ, ఉద్యాపనలూ, ఏవిటో ఈ చాదస్తం?...కాని తనెంత బాధపడుతోందో ఎవ్వరికీ అక్కర్లేదు. ఎవరి అవసరాలు వారికి తీరిపోతే సరి!

'ఇవాళ మధ్యాహ్నం ముఖ్యమైన పాఠం వుందండీ...వీలుపడదేమో...' ఛీ వెధవది ఏం చెప్పాలన్నా ఏం మాట్లాడాలన్నా పాడు కంఠానికింత వణుకెందుకో... అబద్ధం కాదుగా!...అయినా ఏనాడూ తను ఖచ్చితంగా చెప్పలేదు. ఏదో భయం కంఠంలో మసుల్తూనే వుంటుంది!...

'ఏవిటీ ముఖ్యమైనదుందా...ఏం చోద్యమే మామ్మా ఈ చదువులూ నువ్వూ...ఓ అచ్చటా ముచ్చటా?...అదేదే ఈ ఒక్కరోజుకి మానేసే (దానమ్మ కడుపు కాల!) ముంచుకుపోతుందే తల్లీ! నీయిష్టం బాబూ...చదువెందుకు ఊళ్లేలాలా అంటే విన్నారు కనకనా' మరింక వినిపించలేదు. విజయ కారెక్కింది...మాధవరావన్నాడు. 'ఆ...మునిగిపోయింది లేదు లే...క్లాసులయ్యాకే రా!...అని. మాటలనటంతోటే సరికాదు...తను రాకపోతే ఏం జరుగుతుందో విజయకి బాగా తెలుసు అత్తగారు పనంతా తనమీదే పడిందనుకొంటుంది... కోడలొస్తుంది కోరికలు తీరుస్తుంది అనుకున్నాను గాని - మరింకా ఇటువంటివే అసంతృప్తి, అసంపూర్తి వాక్యాలు మరేవో...విజయకి అత్తగారిమాటల్లో తన హృదయాన్ని దూసుకుపోయే శూలాలున్నాయని ఎప్పుడూ బాధపడలేదు. పూర్వాచారపరాయణురాలైన ఒక పెద్ద ముత్తైదువ అసంతృప్తి మాత్రమే ఆవిడ మాటల్లో విజయకి ధ్వనిస్తుంది...తన మూలంగా ఆవిడెందుకు అనుకోవాలి?... ఎంత కష్టం అయినా సరే ఆవిడ చెప్పిన పనే చేద్దాం అనే భావమే విజయకి కలుగుతుంది. ఇక మామగారి విషయంచూస్తే ఆయనకీ సంగతులేవీ పట్టవేపట్టవు సమయాని కాలస్యం చేయకుండా కారెక్కడానికివస్తే సరి...

అంతా మంచివారులానే కనిపిస్తూన్నా అప్పుడప్పుడు ఏవో గ్రహింపరాని కాఠిన్యాన్ని మనసులో దాచుకున్నట్టుగానే కనిపిస్తారు విజయకి. తమ మూర్ఖపు పట్టుదలలన్నీ తనమీద రుద్ది తనద్వారా తమ కోర్కెలు నెరవేర్చుకోటంతో రాక్షసుల్లా కనిపిస్తారు. భర్త కిష్టం కనక చదువుకోవాలి. అత్తగారి కచ్చటా ముచ్చటా కనక నోములూ వ్రతాలూ నెరవేర్చాలి. మామగారి కాలస్యం కాకుండా సిద్ధం కావాలి. మరి చంటిపిల్లకి మాత్రం తనమీద హక్కు లేదా?...అది ఏడుస్తుంది! దాన్ని సముదాయించాలి. ఇవన్నీ అక్షరాలా ఆడదై పుట్టినందుకు తను నెరవేర్చాల్సిన విధులు. విజయకి ఆలోచిస్తూంటే ఏడుపొస్తుంది. ఈ నోములెందుకు? ఈ చదువెందుకు? ప్రాణానికి సుఖం లేకపోయాక!

అయినా ఎందుకని తను ప్రశ్నించే అధికారం లేదు. ఎందుచేతనంటే అవి తన బాధ్యతలు!...వాటికి తిరుగులేదు...మరీ చిత్రం ఏమిటంటే ఎవరి అవసరం వారికెక్కువగా కనపడుతుంది.

'నువ్వు చదువుకోటం నా కోరిక కనక అది నువ్వు నెరవేర్చాలి. ఇంక అమ్మ చాదస్తపు నోములూ వ్రతాలూ అంటావా? అవాట్టే అవసరం కాకపోయినా ఆవిడ సంతృప్తికూడా నీకు కావాలంటే చెయ్యి. లేదా మాను.' అంటాడు మాధవరావు.

'ఎక్కడ ఏపని వుండనీ అమ్మాయ్... సరిగ్గా తొమ్మిదిన్నరకి నువ్వు సిద్ధంకావాలి. నాకు కోర్టుకి మాత్రం ఆలస్యం కాకూడదు...' పక్కచ్చవాలిటే అంతా తనలోనే పుట్టి పెరుగుతోందనుకునే మామగారి సవాలు.

'ఇదుగో కోడలుపిల్లా.... ఒక్కగానొక్క కొడుకూ, కోడలూ...అచ్చటా ముచ్చటా తీరాలని ఎంతో ముచ్చటపడుతున్నాను. ఏదో పెద్దదాన్ని కాబట్టి నామాట వినాల్సిన విధి నీకుంది. ఆడదానికి నోములూ వ్రతాలే ఇహపరాల కవసరం. కాని చదువు సంధ్యలు కావు'—చాదస్తపు టత్తగారి సబబైన కోరిక!

అందరి చాటునా మాటునా మెలగవలసింది కాబట్టి అన్నిటికీ సరేనంది విజయ. మరీ ఈనాటి చదువుకునే పిల్లల్లో ఎక్ట్రీమ్ టైప్‌కి కాకా మోడరేట్ టైప్‌కి చెందినదవటంమూలాన ఇంట్లో అందరి సంతృప్తీ తన కవసరమే ననుకుంది విజయ.

నలుగురూ తనని అదృష్టవంతురాలనంటారు: తనూ అనుకుంటుంది. అత్తమామలు మంచివాళ్లు. భర్త మంచితనం అందర్నీ మించిందే. పి. హెచ్‌డి చదువుతున్నాడు. అంతా బాగానేవుంది. అందరూ సంస్కారం ఉన్నవాళ్ళే. ఈ సంస్కారాల మధ్యలోనే తన కేదో వెలితిగా కనిపిస్తుంది. అత్తగారి ఆదరణలలో లోపం లేదు. ఆవిడ తన చదువుకు భంగం కలిగించదు. కారణం లేకుండా కసిదీర్చుకోవాలనే మూర్ఖత్వం లేదు. తన మాట జవదాటనంతవరకూ, తన ఆజ్ఞలని పొల్లుపోకుండా నెరవేర్చినంతవరకూ ఆవిడ చాలామంచిదే. పెద్ద ముత్తైదువు, తానేవంటే ఏం బాధపడుతుందో! పోనీ చాతనైనంతవరకూ ఎవ్వరికీ కష్టం కలిగించటం తన కిష్టంలేదు. కాని ఈ వివిధ సంస్కారాల ఒత్తిడిలో తానెంతగా నలిగిపోతోందో గుర్తుకి వచ్చినప్పుడల్లా బావురుమనా లనిపిస్తుంది. తన మనస్సు అత్తగారి కడ్డు చెప్పలేదు. హృదయం భర్తకి కాదనలేదు. మధ్యలో తనకి చంటిపిల్లతంటసం! ఎందరు పెళ్ళైనవాళ్లు ఏ బాదరబందీ లేకుండా సుఖంగా ఉండటంలేదు? భగవంతుడికి కూడా తన మీద కసే కాబోలు! తన సాధక బాధకాల్ని గురించి యోచించేవాళ్లు లేరు కాని ఎవరి అవసరాలు కోరికలూ వారికి తీరాలి! ఎంత స్వార్థం?!!...

విజయకి పుట్టింటి కోమారు వెళ్ళాలనుంది. కాని పంపించేవాళ్లుంటేగా!... అత్తారిళ్లల్లో కోడళ్లకి చదువు చెప్పించటం వాడవాడా అనుకుంటున్న మాటల్లో కేవలం తన అదృష్టం అయినా అది తనకు దురదృష్టంగానే వుంది! మొన్న శ్రావణ మాసం నోములకి తనని పంపించమంటూ తల్లి స్వయంగా వస్తే చదువుకి భంగం కాబట్టి ససేమి వల్లకాదన్నాడు మాధవరావు. మహా తనిక్కడుండి పొడిచేస్తున్నట్టు! ఎంత 'వద్దమ్మా......ను వ్వెళ్లి చదువుకో'...అని అత్తగారన్నా అది మాటవరసగానే వుంటుంది గాని పుట్టింటో అమ్మన్నట్టుంటుందా? ఆవిడ పని చేస్తూన్నంతసేపూ ఏదో తనూ చేస్తూ కూడా వుండాలే గాని పుస్తకం పట్టుకుని కూర్చోలేదు. అత్తసేవా, భర్తసేవా' చంటిదాని సేవా చేశాక ఇంక తనకి చదువుకోవాలంటే విసుగొస్తుంది...కాని తనకి చదువు మీద యిష్టం లేకనా?...

విజయ పాపని నిద్రపుచ్చుతోంది. మాధవరావు వచ్చాడు 'హల్లో మైడియర్' అంటూ. ఎప్పుడూ హుషారుగానే వుంటాడు. ముచ్చటైన మనస్తత్వం అతనిది. విజయ కావేళ చిరాగ్గా వుంది. ఎలాగైనాసరే తన దృఢనిశ్చయం అతనితో చెప్పెయ్యాలి. మాధవరావు నిద్రపడుతున్న పిల్లని లేవదీసి కూర్చోపెట్టి నవ్విస్తున్నాడు చక్కిలిగింతలు పెడుతూ. 'రేపట్నుంచి కాలేజీ మానేస్తున్నాను' అంటూ పరీక్షగా చూసింది అతనివైపు. కాస్సేపటివరకూ వినిపించనట్టుగానే ధోరణి మారనేలేదు. అబ్బ! ఎంత నిర్లక్ష్యం? విజయకి కోపం వచ్చింది.

'ఏం కథ? పాతపాటేనా? లేక ఏమైనా కొత్త ఆటంకాలా?'...అతను చిరునవ్వుతోనే అంటాడు ఏదన్నా. తనలో భుగభుగ మంటుంది. 'పాతదో కొత్తదో... నేనీ చదువుతో వేగలేను. ఇన్ని వ్యాపారాలు ఒక్కసారిగా చెయ్యడానికి నేనేం సవ్యసాచినికాను. మీ నవీనత్వానికీ అమ్మగారి ఛాందసానికీ పొత్తు కుదరదు. నిన్నటికి నిన్న పూజా పేరంటాల్లో గడిచిపోయిందా? చదివేందుకు తీరికేదీ! ఇవాళ

ఎప్పుడూ క్షణమైనా చింతలేదు

అతడు లాక్టోజన్ పాప కావడమే కారణం. తల్లిపాలవలె పుష్టికరమైనదేకాక తేలికగా లాక్టోజన్ అరుగుతుంది.

విశ్వసించండి
LACTOGEN
తల్లిపాలు ఇవ్వలేనపుడు

ఉచిత లాక్టోజన్ ఫోల్డర్‌కు ఈ కూపన్ పూర్తిచేసి పంపండి.
నెస్లెల్స్ ప్రాడక్ట్స్ (ఇండియా) లి.
పోస్టు బాక్సు 396, కలకత్తా

8

పేరు ______
చిరునామా ______
______

L6/G/8

టెస్ట్ బూడిదయింది. ఇల్లా చదివితే నేను పాసుకాలేను'—చక్కిలిగింతలో పక్కున నవ్వింది పాప. గుర్రుమని చూసింది విజయ. పక్కున నవ్వేడు మాధవరావు. 'ఎవరికీ లేని బాధ్యతలూ బరువులూ నువ్వే మోస్తున్నావు కాబోలు. అందరూ ఎల్లా చదువుకుంటున్నారో చెప్పగలవా చకోరాక్షీ!' ఎంత అవహేళన! అభిమానం ముంచుకు వచ్చింది. 'చదువుకోకపోతే ఈనాడు సంఘంలో సభ్యతా, మర్యాదలుండవ్!' మాధవరావన్నాడు తిరిగి. రేపు నేను పి. హెచ్ డి. చేశాక నా భార్యవైన నువ్వు విదుషివి కాకపోతే నాకు తలవంపు' మాధవరావులో లేని గాంభీర్యం, కరకుతనం తొణికిసలాడేయి. విజయకి పట్టరానికోపం గట్లు తెంచుకుంది...'ఏమైనాసరే రేపు నేను కాలేజీకి పోవటంలేదు. నా బాధ్యతలు బరువుల విషయం ఒకళ్లు చెప్పవలసినవి కావు. ఆ కష్టసుఖాలు నాకు తెలుసు' ఉద్రేకంగా అంది విజయ.

రెండురోజులు పట్టుదలగా కాలేజీ మానేసింది. ఈ రెండురోజులూ ఒక్క మాట కూడా మాట్లాడించలేదు మాధవరావు. తను అపరిమితంగా ప్రేమించే విజయా అనే పిలు పతిని నోటినుంచి తను వినలేదు. విజయ మానసికంగా చాలా బాధపడింది. దానికి తోడు రెండోరోజున కాబోలు మధ్యాహ్నం అత్తగారందుకుని 'అంత డబ్బూ కట్టి, పుస్తకాలూ అవీ కొని వాడెంత ముచ్చటపడుతూంటే మధ్యలో నువ్వు చేసే నిర్వాకం ఇదటే? అంది. ఈ మాటలు విజయ మనస్సును మరీ కలవరపరిచాయి. తనేం చెప్తే వీళ్లకర్థం అవుతుంది? ఎదురు తిరిగిందన్న పేరుమాత్రం తనపరం అవటం తప్పిస్తే?!...మర్నాడు తాను తిరిగి కాలేజీకి సిద్ధంఅయ్యాక తిరిగి 'విజయా!' అన్న పిలుపు భర్తనోటినుంచి వింది. ఆ ప్రేమ, ఆ లాలనే, తనకు పరమార్థంగా ఉన్నప్పుడు తన ఇష్టప్రకారంగా ఏపని చేయకలుగుతుంది ఆడది? స్త్రీ హృదయం రీతే అంత!!...ఆ అభిమానం విజయ పుస్తకం పుచ్చుకున్నప్పుడల్లా విన్నాడుతూనే వుంది.

పరీక్షల్లో ఏమంత తృప్తికరంగా రాయలేకపోయింది. అయినా హసాన్ ఎగ్జామినేషన్ కాబట్టి ఫరవాలేదనుకున్నారు. కాని ఫలితాలు తెలిసిన రోజున తనపేరు నోటీసు బోర్డుమీద లేదు. మొదట ఏ కాస్సేపో బాధించినా, ఆతర్వాత తనను బాధించలేకపోయిందా విషయం! మొదటి సంవత్సరమే తను ఫేలైంది. కాబట్టి ఇక చదువుకోమని బలవంతం చెయ్యరు. ఏ బాదరబందీ లేని సుఖజీవులకిగాని తనకెల్లా వస్తుంది చదువు? అయినా తను ప్రయత్నించినా విఫలం అయితే దానికి బాధ్యత తనది కాదు.

అత్తగారు విని ఊరుకుంది. ఒక్కటే మాటంటుంది ఎప్పుడన్నా. 'ఆ....సంసార్లకేం చదువులు వస్తాయి' అని. వీళ్ళకి ఉండేది ఒక్క నాలుక కాదు కాబోలు! విజయకి ఒళ్లు మండింది. 'బాగానే రాశావన్నావు కదమ్మా! ఏంచేతపోయిందో?...' మామగారు యథాలాపంగా వేశారు ప్రశ్న. విచారపడుతూన్నట్టు విజయ నటించిందంటే నిజమే. మొండి సంతృప్తేదో తన నానందింపజేస్తోంది. ఇకమీద అప్పుడప్పుడు అత్తగారికి తనమీదకలిగేఅసంతృప్తి లేకుండా సంచరింపవచ్చు. టైముకు రావాలన్న మామగారి ఆజ్ఞకి తను బద్ధురాలై ఉండక్కర్లేదు ఈపైన పాపాయి సేవకి రోజంతా అర్పించవచ్చు...పాపం! అప్పుడప్పుడు ఇంట్లోవాళ్లమీద కలిగిన విసుగును వెలిబుచ్చేందుకీపాపే దొరికింది! నిజంగా తానెంత నిర్దయగా ప్రవర్తించింది కొన్ని కొన్ని సమయాల్లో?

విజయ పాపమీద ముద్దులవర్షం కురిపించింది. సంగతి తెలిశాక మాధవరావన్నాడు "ఎప్పుడూ చదువొద్దో అని ఏడవటం తప్ప మనస్సుంచి చదివితేగా పాసవడానికి! చదివే అవకాశాలేని వాళ్లు చదువో అనేసిస్తే అవి వున్న నీ ఏడుపిది!" అని మాధవరావు కంఠకోపం ఎప్పుడూ రాలేదు. విజయకి ఆశ్చర్యం కలిగింది. నిజంగా తను మనస్సుంచి చదవకపోవటం మూలాన్నేనా పాసుకానిది? 'బహుశా సెలవులయ్యాక రీ ఎగ్జామినేషన్ ఉంటుంది!" మళ్ళీ అన్నాడు. విజయ మనస్సులో రైళ్లు పరిగెట్టేయి. తను చదవాలని అంటాడు గాబోలు! 'ఉంటేఉంటుంది. అయినా నాకవసరం ఏమిటి?' ముఖం మరోకవైపు పెట్టి అంది విజయ.

'అంటే?' మాధవరావు కొంచెంగట్టిగా అన్నాడు. విజయ స్తంభించిపోయింది క్షణకాలం. తమాయించుకుని 'నే చదవననుకున్నాగా!' సాఫీగా అంది. క్షణంసేపు మాధవరావు మౌనం ధరించాడు. 'విజయా!' అన్నాడు తర్వాత తన పిలుపులోవున్న కటువు అతనికి బహుశా తెలిసేఉండాలి. కళ్లల్లో చిరుహాసం నటిస్తూంటే విజయ అతన్ని చూసింది 'నువ్వు చదువుకోవాలి విజయా. కావలిస్తే సెలవల్లో నే కోచ్ చేస్తాగా .. ఫసియర్‌లో నే పాసుకాలేకపోయావంటే ఎంత అప్రతిష్ట!'—ప్రార్థనాపూర్వకంగా వున్నా అధికారపూర్వకమైన ధ్వని కూడ లీలగా వినిపించింది విజయ హృదయం పులకరించింది. అటూ ఇటూ ఎటూ తేలని ఏదో అనంతవేదన ఆమెని చుట్టడించింది. ఆ[illegible]య్యా చాదస్తం, ఇంటిపనీ...చదువూ! చంటిపిల్లా?!...

'నువ్వు శ్రద్ధగా మనసుంచి చదువు ఎందుకు పాసవ్వవో నే చూస్తా'...

'తీరిక ఉండదండీ! పనులు చెయ్యకపోతే ఆవిడ విసుక్కోవటం, నొచ్చుకోవటం!...ఆ పరిస్థితి నాకిష్టంలేదు!'...

'అయితే నన్ను నొప్పించటం నీకిష్టమే నన్నమాట!'

ఏంచెయ్యాలి తను? ఎవరిని అవుననాలి? ఎవరిని కాదనాలి? విజయకి దారుణమైన తలనొప్పి హఠాత్తుగా పట్టుకొంది. పాప కిలకిలా నవ్వింది. 'అవును...అందరి యిష్టానుసారం నడవాల్సింది నేనే'...ఆమె పెదవులు అస్పష్టంగా ధ్వనించాయి. పాపని విజయ ఒళ్లో పడేసి వెళ్ళిపోయాడు మాధవరావు. ఇద్దరివైపూ నిర్లిప్తంగా చూస్తూ కూర్చుండిపోయింది విజయ ★

ముసలి తనంలో తిరిగి పెళ్లి చేసుకోవాలని ఒక పెద్ద మనిషికి బుద్ధిపుట్టింది. చేసుకోవలసిన అవసరం గురించి నచ్చచెపుతూ తన స్నేహితుడితో అన్నాడు.

"ఈ గుక్కెడు ప్రాణమూ పోతే కళ్లు మూసేటందుకైనా ఎవరన్నా ఉంటే మంచిది కాదూ?"

"నేనూ ఆ ఉద్దేశ్యంతోనే రెండు సార్లు పెళ్లి చేసుకున్నాను కాని వాళ్లిద్దరూ నా కళ్లు విప్పారు."